క్లుప్తంగా

నేడు వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లి, మిడ్జిల్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నట్లు సీఈఓ బాల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా మహేష్



చిన్నచింతకుంట: బీజేపీ సోషల్ మీడియా, ఐటీ జిల్లా విభాగం కన్వీనర్‌గా మండలంలోని అమ్మపురానికి చెందిన జెట్టెం మహేష్‌ను ఆదివారం రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వెంకటరమణ నియమించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వెంకటరమణకు రుణపడి ఉంటానన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజు



నవాబుపేట: పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కొల్లూర్‌కు చెందిన రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. ఆదివారం రాజుతో పాటు నూతన రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీలో చోటుదక్కటం పట్ల సంఘం నాయకులు లింగం, శ్రీరాంకుమార్, నర్సింహులు, శ్రీనివాస్, యాదగిరి తదితరులు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



స్టేషన్ మహబూబ్‌నగర్: వివేకానంద విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు, రామకృష్ణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకిషన్ ప్రారంభించారు. పూర్వ విద్యార్థులను రాంకిషన్ అభినందించారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి జిల్లా కార్యదర్శి రాజమల్లేష్, విశ్రాంత ఉపాధ్యాయులు నారాయణరావు, వినయ్‌కుమార్, పూర్వ విద్యార్థులు అంజద్‌ఖాన్, విశ్వనాథస్వామి, నజీర్, శ్రీనివాసులు, లక్ష్మణ్, విష్ణు, శ్రీను, అహ్మద్, శంకర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం



స్టేషన్ మహబూబ్‌నగర్: సంస్కృత భారతి, రామకృష్ణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సమితి కార్యాలయంలో నిర్వహిస్తున్న సంస్కృత సంభాషణ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజేత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సంస్కృత భాష భారతీయ సనాతన ధర్మానికి మూల సాధనమని అన్నారు. సంస్కృత సంభాషణ శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి జిల్లా కార్యదర్శి రాజమల్లేష్, సంస్కృత భారతి కోశాధికారి న్యాయవాది మోహన్ ప్రసాద్, రిటైర్డ్ అధ్యాపకుడు సూర్యనారాయణరావు, సభ్యులు నాగరాజు, యాదయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చండి



రాజాపూర్: ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కి కుటుంబపాలనను సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ముదిరెడ్డిపల్లిలో హాథ్ సే హాథ్ జోడోయాత్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎర్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇతర హామీలేవీ నెరవేర్చలేదని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, గోవర్ధన్‌రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

మిడ్జిల్: మండలంలోని వల్లభ్‌రావుపల్లిలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ, ఎంపీటీసీ నర్సింహులు, గ్రామ పెద్దలు, శ్రీనివాసులు, రేణయ్య, శ్రీను, మన్యంకొండ పాల్గొన్నారు.

తిష్ట వేసిన సమస్యలు

- బోయపల్లిలో సగం వరకు మట్టి రోడ్లే
- ఎక్కడికక్కడ దెబ్బతిన్న సీసీరోడ్లు
- తండాల్లో మిషన్ భగీరథ తాగునీరు కలుషితం

వార్డు 16	జనాభా 5,461

ప్రధాన వీధులు:
బోయపల్లి, మారుతినగర్, బీసీకాలనీ, ఎస్సీకాలనీ, సోమేశ్వరకాలనీ, మహమ్మద్‌ఖాన్‌పల్లితండా, హనుమాన్‌చెరువుతండా, సొటకుచ్చతండా.



బోయపల్లిలో మట్టిరోడ్డుపై పారుతున్న మురుగు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 16వ వార్డులో సమస్యలు తిష్ట వేశాయి. బోయపల్లి రెవెన్యూ వార్డు కార్యాలయం పక్క నుంచి బీసీ కాలనీ వరకు మట్టి రోడ్డే దిక్కయింది. మధ్యలోనే విద్యుత్ స్తంభం ఉంది. రెండు చోట్ల మిషన్ భగీరథ పైపులైన్ రోడ్డుపైనే వేశారు. 2001లో నిర్మించిన మోరీలు అడుగు భాగం పూర్తిగా దెబ్బతింది. పాత వాటర్‌ట్యాంకు సమీపంలోని, ఓంకారేశ్వర ఆలయం వెనుక భాగంలోని గల్లీలలో ఎక్కడికక్కడ సీసీరోడ్లు ధ్వంసమయ్యాయి. యాదవ కమ్యూనిటీ భవనం వెనుక మారుతినగర్‌లో కొత్త ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఎస్సీ కాలనీలోని నాలుగు గల్లీలలో మట్టిరోడ్లే దిక్కయ్యాయి. ఈ ప్రాంతంలో డ్రెయినేజీలు తీయడానికి నెలకోసారి పారిశుద్ధ్య కార్మికులు వస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కొత్త ప్లాట్లలో కనీసం 200ఇళ్లు ఉంటాయి. మూడు నాలుగు రోజులకోసారి మిషన్‌భగీరథ పథకం ద్వారా తాగునీరు వస్తోందని స్థానికులు చెబుతున్నారు. వీధిలైట్లు సరిగా వెలగడం, డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదన్నారు. ఇక మహమ్మద్‌ఖాన్‌పల్లి తండా పేరును ఇటీవలే డీఎంనాయక్ తండాగా మార్చుకోగా, సుమారు 100 ఇళ్లు ఉంటాయి. మిషన్ భగీరథ పథకం నుంచి పచ్చగా ఒండుతో కూడిన నీరు వస్తోందని తండావాసులు ఆరోపిస్తున్నారు. గతంలో వేసిన మూడు పవర్ బోర్ల నుంచే తెచ్చుకుని తాగుతున్నామన్నారు. ప్రధాన వీధి తప్పా మిగతా చోట్ల ఇళ్లపై నుంచే విద్యుత్ వైర్లు ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. మిద్దెల పైకి ఎక్కాలంటేనే భయపడుతున్నారు. కనీసం 20 స్తంభాలతో పాటు తీగలు లాగి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. హనుమాన్ చెరువుతండాలో సుమారు 50 ఇళ్లు ఉంటాయి. మిషన్‌భగీరథ పథకం పైపులైన్‌కు నాలుగు చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయని తండావాసులు చెబుతున్నారు. దీంతో తాగునీరు కలుషితమవుతోందని, అది కూడా మూడు నాలుగు రోజులకో సారి పది నిమిషాలే వస్తుందన్నారు. సొటకుచ్చతండాలోనూ ఇదే పరి స్థితి నెలకొంది. చివరకు పవర్ బోర్ల నుంచి తెచ్చు కుని తాగుతున్నామన్నారు. సీసీరోడ్డు బాగానే ఉ న్నా సగం వరకు డ్రెయినేజీ నిర్మించలేదన్నారు. సొటకుచ్చతండా వరకు బీటీ రోడ్డు ఉన్నా చెత్తబండి రాదని తండావాసులు పేర్కొంటున్నారు. రెండు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



బోయపల్లి రెవెన్యూ వార్డు కార్యాలయం పక్కన రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభం



మహమ్మద్‌ఖాన్ పల్లితండాలో మిషన్ భగీరథ కోసం తవ్వి సరిగా పూడ్చని సీసీ రోడ్డు



బోయపల్లిలోని బీసీకాలనీలో ధ్వంసమైన సీసీరోడ్లు

డ్రెయినేజీలు నిర్మించాలి..



కాలనీ ఏటవాలుగా ఉంటుంది. డ్రెయినేజీలు చాలా వరకు ధ్వంసమయ్యాయి. వెంటనే బాగు చేయించాలి. వర్షం వస్తే చుట్టుపక్కల మొత్తం నీరు చేరి ఇళ్లు పాడవుతున్నాయి. మేమే తాత్కాలికంగా మరమ్మతు చేయించుకుంటున్నాం. మిషన్ భగీరథ పథకం పైపులైన్‌ను రోడ్డుపైనే వేశారు. వాహనాలు వాటిపై నుంచి వెళ్లడంతో దెబ్బతింటున్నాయి. సీసీరోడ్డును ఎక్కడికక్కడే తవ్వి సరిగా పూడ్చలేదు.

– పల్లె కుమార్, బీసీకాలనీ, బోయపల్లి

పండగలప్పుడే ఊడుస్తారు..



తండాలో పండగలప్పుడే పారిశుద్ధ్య కార్మికులు వచ్చి రోడ్లు ఊడ్చిపోతారు. ఆ తర్వాత పట్టించుకోరు. డ్రెయినేజీలు దుర్గంధంతో దోమలు విపరీతంగా పెరిగి అనారోగ్యానికి గురవుతున్నాం. మిషన్ భగీరథ పథకం నీళ్లు బాగా లేవు, పచ్చగా ఉంటాయి. పవర్ బోర్ల నుంచి తెచ్చుకుని తాగుతున్నాం. వీధిదీపాలు కాలిపోతే మార్చడం లేదు.

– జమునీ, మహమ్మద్‌ఖాన్‌పల్లితండా వాసి

సమస్యలు పరిష్కరిస్తాం..



బోయపల్లిలోని బీసీకాలనీలో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మిస్తాం. వీటి కోసం రూ.20లక్షలు మంజూరయ్యాయి. రెవెన్యూ వార్డు కార్యాలయ భవనం పాతది కావడంతో కూల్చి బస్తీ దవాఖానా నిర్మిస్తాం. హనుమాన్ చెరువు తండా, మహమ్మద్‌ఖాన్‌పల్లి తండాల్లో సమస్యల పరిష్కారానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు చేపడతాం. ఇలా వివిధ పనులకు రూ.2.40 కోట్లతో అంచనాలు సిద్ధం చేశాం.

– వి.మోతీలాల్, కౌన్సిలర్, 16వ వార్డు

26 నుంచి వహీదుద్దీన్‌షా ఖాద్రీ షుత్తారి ఉర్సు



స్టేషన్ మహబూబ్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని చిన్నదర్పల్లిలోని హజ్రత్ ఖాజా సయ్యద్ మహ్మద్ వహీదుద్దీన్‌షా ఖాద్రీ షుత్తారి దర్గా 31వ ఉర్సు వేడుకలు ఈనెల 26 నుంచి 28వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి సూఫిషా మహ్మద్ ముఖ్తారుద్దీన్ అస్లం, ఆలిండియా సున్ని ఉల్‌మా మషాయక్‌బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా మొహిసిన్‌పాషా ఖాద్రీ తెలిపారు. దర్గా ఆవరణలో ఆదివారం ఉర్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26వ తేదీన సాయంత్రం మగ్‌రీబ్ నమాజ్ అనంతరం గంధోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంధోత్సవాన్ని ఊరేగింపుగా దర్గా వరకు తీసుకెళ్లి అనంతరం పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని తెలిపారు. 27వ తేదీన దర్గా ఆవరణలో ధార్మిక సభ ఉంటుందని, పలువురు మత పెద్దలు హాజరై ధార్మిక సందేశాలు ఇస్తారని తెలిపారు. 28వ తేదీన ఖురాన్, హల్కా షరీఫ్ నిర్వహించి ప్రసాద వితరణ చేపడుతామని తెలిపారు. వేడుకల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాజస్తాన్‌లోని ప్రసిద్ధ అజ్మీర్ షరీఫ్ దర్గాకు చెందిన హజ్రత్ ఖాజా సయ్యద్ గియాస్ ఉద్దీన్, మొయిని చిష్టీ, గుజరాత్‌కు చెందిన సయ్యద్ అహ్మద్ అలీ వారిస్, హజ్రత్ మౌలానా సైఫుల్లా, గులాం సందాని హుస్సేని అలీ ఖాద్రీ, రజాక్ నక్షబంది, ఎంఎస్.హుస్సేన్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ సయిద్ అలీ, మహ్మద్ ఆరిఫుద్దీన్ షుత్తారి, ఆసిఫుద్దీన్ షుత్తారి, మొయిన్‌మాజిద్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈద్‌మిలాప్

జడ్చర్ల: పట్టణంలోని గఫూరియా మసీదులో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. హిందూ, ముస్లింల మధ్య సోదరభావం మరింతగా పెంపొందడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రమేష్‌బాబు, బీఆర్ఎస్ నాయకులు రవిశంకర్, రామ్మోహన్, ఇమామ్ అలీమొద్దీన్, జహీరొద్దీన్, హమీద్, ఆరీఫ్, బురానొద్దీన్, దానిష్ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించండి



అంబట్‌పల్లిలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని బీజేపీ నాయకుడు ఎన్పీ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈనెల 25న జిల్లాలో జరిగే నిరుద్యోగ మార్చ్ సందర్భంగా మన భవిష్యత్తుకై – మన భరోసా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ నాయకులు మండలంలోని దివిటిపల్లి గ్రామ పంచాయతీకి అమ్లేట్ గ్రామమైన అంబట్‌పల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్పీ వెంకటేష్ మాట్లాడుతూ కేటీఆర్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి పేపర్ లీకేజీతో నష్టపోయిన అభ్యర్థులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాక పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈనెల 25న సాయంత్రం జరిగే నిరుద్యోగ మార్చ్‌కు యువత పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగులు, అనుబంధ సంఘాల సమన్వయంతో వేలాది మందితో భారీ ర్యాలీ దిశగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సారథ్యంలో యువగర్జన కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజుగౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, భూషణ్, చంద్రశేఖర్, అంజయ్య, రవిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు తొలగించాలి



అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్దిలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం చేపట్టారు. సాంద్ర సింధు వేదం సారాంశ గ్రంథాలపై ప్రచారం చేశారు. ఇందూ జ్ఞానవేదిక మద్దిగట్ల కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో కుల మతాలను రూపుమాపడంతో పాటు అసమానతలను తొలగించాలని వివరించారు. కార్యక్రమంలో రవి, రమేష్, మనోహర్, యాది, కాలమ్మ, మంజుల, సబిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాభావంతో మెలగాలి



దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ అభిమన్యురెడ్డి

రాజాపూర్: ప్రతి ఒక్కరూ తోటివారికి సేవ చేయాలనే గుణాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో దొండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యురెడ్డి జన్మదినం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడంతో మనం ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినవారమవుతామన్నారు. అంతేకాకుండా పుట్టిన రోజున సేవ నిర్వహించాలనే ఆలోచనతో అభిమన్యురెడ్డి 25మంది దివ్యాంగులకు మూడుచక్రాల వాహనాలను పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. యూత్ ద్వారా ఆడపిల్లల వివాహాలకు రూ.10వేల ఆర్థికసాయం ఇతర సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బచ్చిరెడ్డి, ఎంపీపీ సుశీల, నాయకులు శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, నరహరి, సత్యయ్య, అచ్చయ్య, నరెందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: దొండ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యురెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా బూర్గుల స్టేజీ నుంచి భారీ ఎత్తున ద్విచక్ర వాహనాలు, కార్లతో అభిమానులు ర్యాలీ చేపట్టారు. మండల కేంద్రంలో అభిన్యురెడ్డిని గజమాలతో సత్కరించారు.

నవాబుపేట: ఎంపీటీసీ అభిమన్యురెడ్డి జన్మదిన వేడుకలు నాయకులు శ్రీనివాస్, రఘుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పేదల ఆరోగ్యానికి భరోసా..

మిడ్జిల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వల్లభ్‌రావుపల్లిలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును బాలమ్మకు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాండుయాదవ్, నాయకులు బాలు, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త బసవేశ్వరుడు

జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు



చిన్నచింతకుంటలో బసవేశ్వర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: కుల రహిత సమాజం, మూఢాచారాలకు, సంప్రదాయాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగురవేసిన మొదటి సంఘ సంస్కర్త ససవేశ్వరుడని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం బసవేశ్వర జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీచైర్‌పర్సన్ హాజరై బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సువర్ణరాజు, రాము, ఆత్మలింగం, ప్రభులింగం, రామలింగం, శెట్టి విరేశం, ఉమాపతి, జగదీష్, విరాశివ పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బసవేశ్వరుడు గొప్ప అభ్యుదయ వాది అని డీపీఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శంకర్, తహసీల్దార్ శ్రీనివాస్, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్, నారాయణరెడ్డి, ఖలీల్, మురళి, రాజేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: అభ్యుదయవాది అయిన బసవేశ్వరుడిని ఆదర్శంగా తీసుకోవాలని పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి లింగాయత్, లింగబలియా రాష్ట్ర నాయకుడు ఈశ్వరప్ప అన్నారు. బసవేశ్వర్ జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని వెన్నచేడ్, కొంరెడ్డిపల్లిలో బసవేశ్వరుడి విగ్రహానికి వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ పుల్లారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ చైర్మన్ చిన్నయ్య, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో బసవేశ్వర చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నేతాజీ చౌరస్తా, సిగ్నల్‌గడ్డలో బసవ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, ముడా డైరెక్టర్ రవిశంకర్, పీఏసీఎస్ డైరెక్టర్ జీవన్‌గుండప్ప, సురేష్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: కుల రహిత సమాజం నిర్మించాలన్న లక్ష్యంతో బసవేశ్వరుడు ముందుకు సాగాడని, ఆయన లక్ష్యం నేరవేరే దాకా పట్టువదలని ధీరుడిలా పోరాటం చేశాడని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు నర్సింహులు, వీరశైవ సంఘం రామేశ్వరయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని శివాలయంలో స్వామి వారి డోలారోహణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మరికల్ కోటచింతల ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌గౌడ్, సీటీజన్ ఫోరం నాయకులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం బసవేశ్వర జయంతిని వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అభిషేకం చేసిన తర్వాత బసవ పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శకుంతల, చంద్రశేఖర్, కొండా జగదీశ్వర్, వేగనాథ్, ప్రవీణ్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

బాలానగర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శరణ బసవేశ్వర జయంతోత్సవాలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కేసిరెడ్డి బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నవాజ్, వీర శైవ లింగాయత్ సభ్యులు శంకరప్ప, శరణయ్య, ప్రభులింగం, వీఆర్ఏలు శివలింగం పాల్గొన్నారు.



జడ్చర్లలో..



అడ్డాకులలో..



బాలానగర్‌లో..

బాధిత కుటుంబాలకు పరామర్శ



అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌లో బాధిత కుటుంబాలను ఆదివారం డీఎస్పీ బంటు కిషన్ పరామర్శించారు. గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితులు కురుమూర్తి యాదవ్, మోహన్‌రెడ్డిలు ఈనెల 17న గద్వాల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులను డీఎస్పీ పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మన్నెమ్మ కాలుకు గాయం కావడంతో పరామర్శించారు. డీఎస్పీ వెంట రామన్‌గౌడ్, సాగర్, యాదయ్య, గోపాల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జడ్చర్ల: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి 10గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(30) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు మండలంలోని యాసాయ కుంట తండాకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com